క్లుప్తంగా

నేడు టీఓపల్లెలో వైద్య శిబిరం

చాపాడు: మండల పరిధిలోని టీఓ పల్లె గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డా.రాజేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలందరూ వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు తీసుకెళ్లాలని సూచించారు.

సామాజిక సేవలో ఎన్‌ఎస్‌ఎస్



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

మైదుకూరు: మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని భూమాయపల్లెలో సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ నిర్మాణాన్ని, దేశ భక్తిని, సమాజ సేవను పెంపొందిస్తుందని అన్నారు. కళాశాలకు చెందిన 50 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు నరసింహారావు, శివకేశవ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక రోటరీ కంటి ఆస్పత్రి ఆవరణలో ఆస్పత్రి, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ట్రస్టు ప్రెసిడెంట్ కోటా శివకుమార్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి గజ్జల వెంకటేశ్వరరెడ్డి, ఎంవీఎన్ ప్రభు, బాలసూర్యారావు, సాధు గోపాలకృష్ణ, సూర్యనారాయణరెడ్డి, ఖాదర్ బాషా, డాక్టర్ రాజారాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మిట్టమల్లేశ్వరునికి వెండి పాత్ర బహూకరణ



వెండి పాత్రను చైర్మన్‌కు అందజేస్తున్న దాతలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీ మిట్టమల్లేశ్వరస్వామికి దాతలు కోనపురి రాము, సుగుణ దంపతులు సోమవారం 2 కిలోల వెండి పాత్రను బహూకరించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి దాతలకు ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ రమణ, పాలక మండలి సభ్యులు మాధవాచారి, సోమేశ్వరమ్మ, మల్లికార్జున, రాజశేఖర్, చంద్రావతి, వాణి, సూర్యలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం

పులివెందుల రూరల్ : రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని రక్తనిధి మెడికల్ ఆఫీసర్ రేవతి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ప్రతినిధి కేంద్రంలో వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి రామ్ లక్ష్మణ్‌రెడ్డి ఆధ్వర్యంలో యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తనిధి మెడికల్ ఆఫీసర్ రేవతి మాట్లాడుతూ రక్తదానంపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడిన వారవుతారన్నారు.

లయోల పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బ్రిట్టో మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ముస్తకీమ్ పఠాన్, సోమశేఖర్ ఈ నెల 16, 17 తేదీలలో గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో జరిగిన ఆవిష్కార్-2023లో ఇన్నవేటివ్ ఐడియా మోడల్స్‌లో పాల్గొని ప్రథమ బహుమతి గెలుపొందారన్నారు. వీరికి కేఎల్ యూనివర్సిటీ వారు రూ.15 వేలు నగదుతో సత్కరించడం జరిగిందన్నారు.

20న ఆలయ వార్షికోత్సవం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని సుందరయ్య కాలనీ సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పదో వార్షికోత్సవం ఈ నెల 20వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. ఈ మేరకు వేడుకల పోస్టర్లను సోమవారం విడుదల చేశారు.

చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు

- బాబును చూసి ఊసరవెల్లి సిగ్గు పడుతుంది
- పేలవంగా ప్రధాని మోదీ సభ
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మండిపడ్డారు. ఆయనను చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతోందని విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ చిలకలూరిపేటలో ఆదివారం నిర్వహించిన మోదీ బహిరంగ సభ అత్యంత పేలవంగా జరిగిందని, జనాన్ని సమీకరించడంలో టీడీపీ, జనసేన పార్టీలు విఫలమయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభలతో పోల్చితే ఏ సభకు కూడా ఈ సభ దీటు రాదన్నారు. సభలో ప్రధాని మోదీ స్తబ్దుగా ఉన్నారని, సరిపోని వ్యక్తి ఇంటికి వచ్చినట్లు కనిపించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలని, చంద్రబాబును సీఎంను చేయాలని ప్రధాని ఎక్కడా చెప్పలేదన్నారు.

నైతిక విలువలు లేని వ్యక్తి చంద్రబాబు

గతంలో మోదీ ఉగ్రవాది అన్న నోటితోనే నేడు ఆయన ప్రజాస్వామ్య వాది అని చంద్రబాబు మాట్లాడడం ఆయనకే చెల్లుతుందన్నారు. కుటుంబ వ్యవస్థ గురించి మోదీకి తెలియదన్న బాబు.. నేడు మోదీ అంటేనే సంక్షేమం అంటున్నారన్నారు. ఆయన వ్యక్తిగాదు శక్తి అని రెండు నాలుకల ధోరణితో మాట్లాడటాన్ని రాష్ట్ర ప్రజలందరూ చూశారన్నారు. నైతిక విలువలు, సిద్ధాంతాలు లేని వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. వైఎస్ జగన్ ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నారని, బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గ ప్రజలు టీడీపీ తీరును గమనించి వారికి మీ ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కాకర్ల నాగశేషారెడ్డి పాల్గొన్నారు.

మంచి చేసి ఉంటేనే ఓటేయండి

జగనన్న ప్రభుత్వంలో మీకు మంచి జరిగి ఉంటేనే తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో సోమవారం ఎమ్మెల్యే, ఆయన సతీమణి, 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ అలవలపాటి అరుణాదేవి, వార్డు ఇన్‌చార్జి కాకర్ల నాగశేషారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మున్సిపాలిటీని పట్టి పీడిస్తున్న తాగునీటి సమస్యను తమ ప్రభుత్వంలోనే పరిష్కరించామన్నారు. అధ్వాన స్థితిలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను పడగొట్టి కొత్త బస్టాండ్ నిర్మిస్తున్నామని తెలిపారు. అద్దె భవనాల్లో నడుస్తున్న వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో రూ.65 కోట్లతో శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. రూ.1700 కోట్లతో నియోజకవర్గంలోని ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, సాంబశివారెడ్డి, జయరామిరెడ్డి, సోమేశ్వరరెడ్డి, చెన్నా రంగనాయకులు, గుర్రం రాముడు, ప్రభుకుమార్, దేవలం ప్రసాద్, సుబ్బారెడ్డి, సుబ్బయ్య, సంజీవ్ కర్ణ, పెద్దశెట్టిపల్లె సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కొత్తపేట జయరామిరెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, జెడ్పీటీసీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మాజీ జెడ్పీటీసీ గోర్ల రామలక్ష్మి సుబ్బయ్య యాదవ్, సోములవారిపల్లె సర్పంచ్ ప్రశాంతి, మాజీ సర్పంచ్ రమణయ్య యాదవ్, ఎంపీపీ శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

గడపగడపనూ తట్టండి

- పార్టీ విజయానికి పనిచేయండి
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపు

బద్వేలు అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని, ప్రతి గడపనూ తట్టి ఓట్లు అభ్యర్థించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో తిరిగి వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేసేందుకు బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు సైనికుల్లా పని చేయాలని సూచించారు. సోమవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బద్వేలు మున్సిపాలిటీలోని పలు వార్డుల బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో నిర్వహించిన నేను సిద్ధం – నా బూత్ సిద్ధం కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. టీడీపీ కూటమి మోసపూరిత హామీలు, అసత్య ప్రచారాలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, అల్లాబకాష్, కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తా శ్రీరాములు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఉమర్, కౌన్సిలర్లు కరీముల్లా, చెన్నయ్య, రామ్మోహన్, చెన్నకృష్ణారెడ్డి, వీరనారాయణరెడ్డి, రెడ్డెయ్య, మౌలాలి, షఫి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

అట్లూరు: మండల పరిధిలోని వరదరాజుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మల్‌రెడ్డి నాగిరెడ్డి క్యాన్సర్ వ్యాధితో ఆదివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ సోమవారం ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, సర్పంచ్ ఆర్.వి.సుబ్బారెడ్డి, నాయకులు శ్రీనివాసులరెడ్డి, మల్లారెడ్డి, పెంచల్‌రెడ్డిలు ఉన్నారు.



బూత్ కన్వీనర్లకు ప్రచార సామాగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరాలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా లోక కల్యాణార్థం మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, ఉప దేవతా హోమాలు, మృత్యుంజయ హోమాలు వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇరగం మల్లీశ్వరి, న్యాయవాది ఈవీ సుధాకరరెడ్డి. కమిటీ సభ్యులు, అర్చకులు, నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



మృత్యుంజయ హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం హుండీ ఆదాయం లెక్కించారు. రెండు నెలల్లో స్వామి, అమ్మవారికి భక్తులు రూ.1,35,126 కానుకగా సమర్పించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఏసీ, ఆలయ ఈఓ శంకరబాలాజీ, పర్యవేక్షణాధికారి పాండురంగారెడ్డి, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పక్కాగా 'ప్రవర్తనా నియమావళి'

ఈఆర్‌ఓ కౌసర్ భాను

ప్రొద్దుటూరు: అన్ని రాజకీయ పార్టీలు పక్కాగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.కౌసర్‌భాను తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ పరిధిలోని సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. గొడవలు లేకుండా ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ సువిధ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటర్లు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పట్టణం నలుమూలల నాలుగు చెక్ పోస్టులతో పాటు కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఫారం 6తో ఓటు హక్కుకు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.సాయిప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, డీఎస్పీ మురళీధర్, డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ కౌసర్ భాను

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

చెన్నూరు : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ పార్థసారథి అన్నారు. సోమవారం ఉదయం మండలంలోని ఉప్పరపల్లె (సమస్యాత్మకమైన) గ్రామపంచాయతీ, అలాగే కొక్కరాయపల్లెలో కేంద్ర బలగాలైన సశస్త్ర సీమాబల్ సిబ్బంది (ఎస్‌ఎస్‌బీ)తో కలిసి కార్డన్ సెర్చ్‌తో పాటు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు సమస్యాత్మకమైన గ్రామాలలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించడం జరుగుతుందన్నారు. పచ్చని గ్రామాలలో ఎలాంటి సమస్యలు పెట్టుకోకుండా అందరూ కలసి మెలసి అన్నదమ్ముల వల్లే ఉండాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. అలా కాకుండా ఇష్టానుసారుగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



కేంద్ర బలగాలతో కలిసి పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీట్ల కేటాయింపుపై హర్షం

పులివెందుల టౌన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులలో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులను ఎక్కువ మందిని నిలపడం హర్షణీయమని వైఎస్సార్సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి డేనియల్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయంలో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఇన్ని సీట్లు ఇవ్వలేదని, వైఎస్సార్‌సీపీ మాత్రమే సామాజిక న్యాయం పాటించిందన్నారు. దమ్ముంటే టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్నా ఎక్కువ సీట్లు ఇచ్చే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. కావున ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, ప్రజలందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభం

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో సోమవారం కుమ్మరాంపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక శిబిరం ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు వివిధ అంశాలపై స్థానికులకు అవగాహన కల్పిస్తూ వారి స్థితిగతులను మదింపు చేయడం జరుగుతుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ఆఫీసర్ మల్లేశ్వరమ్మ, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, వలంటీర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి

ఎర్రగుంట్ల : మండలం పరిధిలోని కర్చుకుంటపల్లె గ్రామంలో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాల బ్రోచర్‌ను పంపిణీ చేస్తూ.. లబ్ధిదారులు పొందిన లబ్ధిని వివరిస్తూ ప్రచారం సాగింది. వచ్చే ఎన్నికల్లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం సుధీర్‌రెడ్డిలను మళ్లీ రెండవసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించి వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, గ్రామ సర్పంచ్ సుబ్బరాయుడు, రమణలు, ఎంపీటీసీలు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కలు, పందులను నివారించండి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని వార్డులలో విచ్చలవిడిగా కుక్కలు, పందులు సంచరిస్తున్నాయని, వాటిని నివారించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ 17వ వార్డు కౌన్సిలర్ ఎరికలరెడ్డి సోమవారం మున్సిపల్ కమిషనర్ రామక్రిష్ణయ్యకు వినతి పత్రం అందించారు. 17వ వార్డులో ఓ చిన్నారిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయన్నారు. వార్డులలో కుక్కలు చాలా తిరుగుతూ వృద్ధులు, పాఠశాలలకు వెళ్తున్న చిన్నారులపై దాడి చేస్తున్నాయని చెప్పారు. అలాగే పందులు కూడా విపరీతంగా సంచరిస్తున్నాయని తెలిపారు. ఇవి ప్రజలకు చాలా ప్రమాదకరంగా మారాయన్నారు. వెంటనే వాటిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం

కడప కల్చరల్ : స్థానిక సాయిపేటలోని మహమ్మదుర్ రసూలుల్లా అనాథ శరణాలయానికి చాంద్‌బీ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ లయన్ కె.ఖాసింఖాన్ ఆర్థికసాయాన్ని అందజేశారు. సోమవారం తనను కలిసిన శరణాలయ ప్రతినిధులు తాము నిర్మిస్తున్న శరణాలయ భవనాల కోసం విరాళం ఇవ్వాలని కోరారు. ఇందుకు స్పందించిన ఖాసింఖాన్ రూ. 50 వేలను శరణాలయ నిర్వాహకులు సయ్యద్ అబ్దుల్ రహిమాన్‌కు అందజేశారు.

ఆలయ హుండీ సొమ్ము లెక్కింపు

కడప కల్చరల్ : కడప నగరం దేవుని కడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ హుండీలలోగల సొమ్మును సోమవారం లెక్కించారు. దేవాదాయశాఖ నుంచి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తనిఖీ అధికారిగా హాజరయ్యారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ పి.పద్మాకర్, ధర్మకర్తలు, అర్చకులు పిచ్చయ్యమూర్తి, సుబ్రమణ్యం, జగన్నాథ, విజయ్‌కుమార్, సిబ్బంది సూర్యనారాయణ తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు. జనవరి 18 నుంచి మార్చి 18వ తేది వరకు మొత్తం రూ. 35,877 లభించినట్లు ఈఓ శ్రీధర్ తెలిపారు.

నియోజకవర్గ పరిశీలకుడుగా హనుమంతరెడ్డి

ప్రొద్దుటూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిశీలకుడుగా మలికిరెడ్డి హనుమంతరెడ్డిని నియమించారు. జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఈయన ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. ఆయన సేవలను గుర్తించి పరిశీలకుడుగా పార్టీ నియమించింది. ఆయన సోమవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న హనమంతరెడ్డి

ఆదిత్యారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

పోరుమామిళ్ల: పుల్లివీడు పంచాయతీలో సోమవారం యువనేత డీసీ ఆదిత్యారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, పీఆర్ ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అవినాష్‌రెడ్డిని ఎంపీగా, ఎమ్మెల్యేగా డాక్టర్ సుధాను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, అమెరికన్ ఫుట్‌బాల్ ఇండియా టీమ్ కెప్టెన్ పోతిరెడ్డి సందీప్ రెడ్డి, జేపీసీ కన్వీనర్ కల్లూరు రమణారెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు చాపాటి సాయి నారాయణరెడ్డి, సర్పంచ్ రఘునాథరెడ్డి, మాజీ సర్పంచ్ డాక్టర్ మాబు, పార్టీ నాయకులు రుద్రవరం రాము, మస్తాన్, వెంకటరెడ్డి, బూత్ మేనేజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అవ్వకు గుర్తు చూపిస్తున్న నాగార్జునరెడ్డి

వైఎస్సార్‌సీపీ విజయానికి సహకరించాలి

ముద్దనూరు : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఆకుతోటపల్లె, చిన్నకత్తెరపల్లె గ్రామాల్లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో సంక్షేమ పథకాల అమలులో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారని తెలిపారు. ఈ సంక్షేమ పథకాలన్నీ మళ్లీ అమలు కావాలంటే వైఎస్సార్‌సీపీ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో వున్న తనకు, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విశ్వనాథరెడ్డి, రాజా, ఓబులేసు, రామాంజి, సుదర్శన్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సుమంత్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నేడు కలమల్లలోని పునరావాస కాలనీలో..

ఎర్రగుంట్ల : మండల పరిధి కలమల్ల గ్రామ పంచాయతీలోని పునరావాస కాలనీలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేయనున్నారని పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

జగనన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

పులివెందుల టౌన్ : త్వరలో జరిగే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు అత్యధిక మెజార్టీ రావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని 15వ వార్డులో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆ వార్డు కౌన్సిలర్ బొగ్గిటి డేనియల్ పురుషోత్తం, లిడ్ క్యాప్ డైరెక్టర్ రాజేశ్వరి కృష్ణమూర్తి, కోఆప్షన్‌మెంబర్ దాసరి చంద్రమౌళి, మాజీ కౌన్సిలర్ కోళ్లభాస్కర్, సూరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన లబ్ధిని వివరిస్తూ రాబోయే ఎన్నికలలో జగనన్నను, వైఎస్ అవినాష్ అన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

ప్రొద్దుటూరు కల్చరల్: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో 70 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు తెలుగు, సంస్కృతం, ఉర్దూ పరీక్ష రాశారు. మొదటి రోజు కావడంతో విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల వద్దకు గంట ముందే చేరుకున్నారు. ఉదయం 9 గంటలకు పరీక్ష గదిలోకి విద్యార్థులను అనుమతించారు. ప్రొద్దుటూరు డివిజన్ 18 మండలాల్లోని 70 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాశారు. ప్రొద్దుటూరు మండలంలో 19 పరీక్షా కేంద్రాల్లో 3,824 మందికి గాను 3,765 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 59 విద్యార్థులు గైర్హాజరయ్యారు.

చాపాడు మండలంలో..

చాపాడు: మండలంలోని చాపాడు, లక్ష్మీపేట గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలలో సోమవారం జరిగిన మొదటి రోజు పదో తరగతి తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. చాపాడులో 271 మందికి గాను 263 మంది హాజరయ్యారని, లక్ష్మీపేటలో 111 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈఓ రవిశంకర్ తెలిపారు. చాపాడు, లక్ష్మీపేట లోని రెండు పరీక్షా కేంద్రాలను కడప డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించి 144 సెక్షన్ అమలుపరచినట్లు తహసీల్దారు భూషణం తెలిపారు.



ప్రొద్దుటూరులోని వసంతపేట మున్సిపల్ హైస్కూల్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు